మహనీయుల స్మరణలో..

వారి పేర్లతో ఉక్కు నగరంలో పార్కుల ఏర్పాటు

ఉక్కునగరం: భారతదేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో మహనీయులు పోరాడి ప్రాణాలు అర్పించారు. స్వతంత్రానంతరం ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం జరిగిన ఆందోళనల్లోనూ పలువురు ప్రాణాలు కోల్పోయారు. ఆ త్యాగాల పరంపరలో భాగంగానే 'విశాఖ ఉక్కు – ఆంధ్రుల హక్కు' ఉద్యమంలో రాష్ట్రవ్యాప్తంగా 32 మంది అమరులయ్యారు. ఈ మహనీయుల ఆందోళనల ఫలితంగానే విశాఖ ఉక్కు కర్మాగారం (వైజాగ్ స్టీల్ ప్లాంట్) ఏర్పడి నేడు ప్రత్యక్షంగా వేలాది మందికి, పరోక్షంగా లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తోంది. ఈ త్యాగాలను స్మరించుకుంటూ, స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం దేశం కోసం, రాష్ట్రం కోసం, విశాఖ ఉక్కు కోసం పోరాడిన మహానుభావులను చిరస్మరణీయం చేయడానికి చర్యలు చేపట్టింది. అందులో భాగంగా, ఉక్కునగరంలో వారి పేర్లతో పార్కులను ఏర్పాటు చేయడమే కాకుండా, వారి విగ్రహాలను కూడా నెలకొల్పింది. ప్రతీ ఏటా వారి జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం ద్వారా వారి త్యాగాలను స్మరించుకుంటూ, భావి తరాలకు ఆదర్శంగా నిలిచేలా చేస్తోంది. అవేంటో చూద్దాం..



నెహ్రూ పార్క్

భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ స్మారకార్థం కేబీఆర్ సమీపంలో ఈ పార్కును ఏర్పాటు చేశారు. ఇందులో నెహ్రూ విగ్రహాన్ని 1989 నవంబర్ 14న నాటి సీఎండీ డి.ఆర్. ఆహుజా ఆవిష్కరించారు.



అంబేడ్కర్ పార్క్

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ స్మరణార్థం సెక్టార్–1లో ఈ పార్కును ఏర్పాటు చేసి, అందులో ఆయన విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. 1991 అక్టోబర్ 14న నాటి సీఎండీ పి.కె. రథ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు.




తెన్నేటి పార్క్

విశాఖ ఉక్కు ఆందోళనలో ముందుండి నడిపించిన నాటి పార్లమెంట్ సభ్యులు తెన్నేటి విశ్వనాధం స్మరణార్థం సెక్టార్–9లో ఈ పార్కును ఏర్పాటు చేశారు. 1992 ఆగస్టు 1న నాటి ప్రధాని పి.వి. నరసింహారావు చేతుల మీదుగా తెన్నేటి విగ్రహాన్ని ఆవిష్కరించారు.



ఇందిరా గాంధీ పార్క్

విశాఖ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు మూల కారకురాలు, శంకుస్థాపన చేసిన మాజీ ప్రధాని ఇందిరా గాంధీ పేరిట సెక్టార్–8 కూడలి వద్ద పార్కును ఏర్పాటు చేసి, అందులో ఆమె విగ్రహాన్ని నెలకొల్పారు. 1994 నవంబర్ 19న నాటి సీఎండీ జె. మెహ్రా ఈ విగ్రహాన్ని ఆవిష్కరించారు.



మహాత్మా గాంధీ పార్క్

జాతిపిత మహాత్మా గాంధీ స్మారకార్థం సెక్టార్–8లోని పార్కులో 2005 అక్టోబర్ 2న గాంధీ విగ్రహాన్ని నాటి సీఎండీ వై. శివసాగర్ రావు ఆవిష్కరించారు.



కణితి జంక్షన్

కేబీఆర్ సమీపంలోని కణితి కూడలి వద్ద 2006 నవంబర్ 26న నాటి సీఎండీ వై. శివసాగర్ రావు తెలుగు తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించారు.



ఉక్కు స్టేడియం కూడలి

దేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్ పాలకులతో పోరాడిన అల్లూరి సీతారామరాజు కాంస్య విగ్రహాన్ని ఉక్కు స్టేడియం కూడలి వద్ద ఏర్పాటు చేశారు. 2006 డిసెంబర్ 9న సీతారామరాజు విగ్రహాన్ని నాటి సీఎండీ వై. శివసాగర్ రావు ఆవిష్కరించారు.



హిల్‌టాప్ కూడలి వద్ద

ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని మెయిన్‌గేట్ సమీపంలోని హిల్‌టాప్ కూడలి వద్ద ఏర్పాటు చేశారు. 2007 ఫిబ్రవరి 20న ఈ విగ్రహాన్ని నాటి కేంద్ర మంత్రి టి. సుబ్బరామిరెడ్డి ఆవిష్కరించారు.



హిల్‌టాప్ కూడలి సమీపంలో

స్టీల్‌ప్లాంట్ కోసం 21 రోజులు అమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణ త్యాగానికి సిద్ధపడిన ఉద్యమకారుడు టి. అమృత రావు విగ్రహాన్ని 2008 ఏప్రిల్ 27న నాటి సీఎండీ పి.కె. బిష్ణోయ్ ఆవిష్కరించారు.



జగ్జీవన్‌రామ్ పార్క్

బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం కృషి చేసిన భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ స్మరణార్థం సెక్టార్–5లో పార్కును ఏర్పాటు చేశారు. అందులో ఏర్పాటు చేసిన జగజ్జీవన్‌రామ్ విగ్రహాన్ని 2008 ఏప్రిల్ 5న నాటి పర్సనల్ డైరెక్టర్ అయ్యప్పనాయుడు ఆవిష్కరించారు.



అమర వీరుల స్థూపం

స్టీల్‌ప్లాంట్ కోసం ప్రాణత్యాగం చేసిన 32 మంది ఉద్యమకారుల స్మారకార్థం హిల్‌టాప్ సమీపంలో అమర వీరుల స్థూపంను ఏర్పాటు చేశారు. 2008 అక్టోబర్ 14న నాటి సీఎండీ పి.కె. బిష్ణోయ్ దీనిని ఆవిష్కరించారు.

క్లుప్తంగా

గ్రంథాలయ ఉద్యమ పితామహుడు 'అయ్యంకి'



అయ్యంకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గ్రంథాలయాధికారి పీవీ రమణ తదితరులు

పెదగంట్యాడ: గ్రంథాలయాల సుస్థిరత కోసం అయ్యంకి వెంకటరమణ అలుపెరగని పోరాటం చేశారని పెదగంట్యాడ శాఖా గ్రంథాలయాధికారి పి.వి. రమణ అన్నారు. గురువారం స్థానిక గ్రంథాలయంలో నిర్వహించిన అయ్యంకి జయంతి వేడుకల్లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.ఈ సందర్భంగా అయ్యంకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠకులు పురుషోత్తం, యుగంధర్, గణేష్, రాంబాబు, లావణ్య, చాందిని తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గాజువాక : మింది, గాజువాక విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో పంతులుగారి మేడ, గాజువాక హైస్కూల్ రోడ్, రాజీవ్‌మార్గ్ ఫీడర్లకు శుక్రవారం నిర్వహణ పనులు చేపట్టనున్నట్టు ఏపీ ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.కె.నాయుడు తెలిపారు. ఈ కారణంగా శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు పంతులుగారి మేడ ఏరియా, జోగవానిపాలెం, పాతగాజువాక, నీల్‌కమల్ వీధి, హైస్కూల్ రోడ్, పెంటయ్యనగర్, కృష్ణానగర్, భానోజీతోట, సంజీవ్‌గిరి కాలనీ, రాజీవ్ మార్గ్ రోడ్, సత్తెమ్మతల్లి ఆలయం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



పరిశుభ్రత కారక్రమం చేపడుతున్న అధ్యాపకులు, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

అగనంపూడి: మనం నివసించే ప్రదేశమే కాకుండా పరిసరాలు కూడా పరిశుభ్రంగా ఉన్ననాడే ఆరోగ్యంతో పాటు ఆనందం ఉంటుందని దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జె. సుధాకర్, రెక్టార్ వి. మధుసూదనరావు అన్నారు. దువ్వాడ విజ్ఞాన్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో 'స్వచ్ఛ క్యాంపస్ అభియాన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆవరణలోని పిచ్చిమొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ పీఓ పి. సన్యాసిరావుతో పాటు 300 మంది వాలంటీర్లు పాల్గొన్నారు.

ఫైలేరియా బాధితులకు కిట్ల పంపిణీ



ఫైలేరియా బాధితునికి కిట్టు అందజేస్తున్న డాక్టర్ సంపత్‌బాబు

పెదగంట్యాడ: ఫైలేరియా వ్యాధితో బాధపడుతున్నవారు జాగ్రత్తలు తీసుకోవాలని పెదగంట్యాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సంపత్‌బాబు సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బాధితులకు గురువారం ఆస్పత్రిలో ఫైలేరియా కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి తనకాల సత్యనారాయణ, యాంటీ మలేరియా గాజువాక సబ్–యూనిట్ ఆఫీసర్ వై. నూకరాజు, సూపర్‌వైజర్లు శ్రీనివాసు, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

16న శ్రీకృష్ణ, గోపికా వేషధారణ పోటీలు



ప్రచారంలో పాల్గొన్న ఇందూ జ్ఞానవేదిక సభ్యులు

గాజువాక : శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా వచ్చే నెల 16న పాఠశాల విద్యార్థులకు భగవద్గీత పఠనం , శ్రీకృష్ణ, గోపికా వేషధారణ పోటీలను నిర్వహించనున్నట్టు త్రైత సిద్ధాంతం, ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞానవేదిక అధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు. ఈ పోటీలపై షీలానగర్ ప్రాంతంలో గురువారం ప్రచారం నిర్వహించారు. వేంకటేశ్వర కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఈ పోటీలను నిర్వహిస్తామన్నారు. నర్సరీ నుంచి 5వ తరగతి వరకు జూనియర్స్ గ్రూపుగాను, 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు సీనియర్స్ గ్రూపుగాను పోటీలు ఉంటాయన్నారు. ఈ పోటీల్లో ఆసక్తిగల విద్యార్థులందరూ పాల్గొనాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో రమేష్, మీనాక్షి, మహాలక్ష్మి, శ్రీయ, మంగ, మహా, ఉషశ్రీ తదితరులు పాల్గొన్నారు.

బీడీఎల్ ప్రమాదంలో గాయపడిన బాలికకు ఆర్థిక సహాయం



బాలిక తల్లిదండ్రులకు ఆర్థిక సహాయం అందచేస్తున్న అధికారులు

కూర్మన్నపాలెం : భారత్ డైనమిక్స్ లిమిటెడ్ వద్ద జరిగిన ప్రమాదంలో గాయపడ్డ మానశ్రీ అనే బాలికకు అన్ని విధాలా అండగా నిలిచామని దువ్వాడ సీఐ కె.మల్లేశ్వరరావు తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే బాలికను ఆసుపత్రికి తరలించి, తమ సొంత ఖర్చులతో వైద్యం చేయించామని ఆయన పేర్కొన్నారు. అనంతరం సురక్షితంగా బాలికను ఇంటికి చేర్చినట్లు తెలిపారు. మిగిలిన వైద్య ఖర్చుల నిమిత్తం బీడీఎల్, ఎస్ఎస్‌జీ సంస్థలు సంయుక్తంగా మరో రూ. 50 వేలను మానశ్రీ తల్లిదండ్రులకు గురువారం అందజేశాయని సీఐ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తమ సిబ్బంది, ఎస్ఎస్‌జీ అధికారులు పాల్గొన్నట్లు ఆయన చెప్పారు.

నిర్వాసిత కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



ఉక్కు అడ్మిన్ వద్ద ధర్నాలో పాల్గొన్న కార్మికులు, నాయకులు

ఉక్కునగరం : విశాఖ ఉక్కు నిర్వాసితుల కాంట్రాక్ట్ లేబర్ యూనియన్, ఐక్య సంఘం ఆధ్వర్యంలో గురువారం ఉక్కు హిల్‌టాప్ కూడలి వద్ద భారీ ధర్నా నిర్వహించారు. తమను విధుల్లోకి తీసుకోవాలని కార్మికులు పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భం గా కార్మిక నాయకులు మాట్లాడుతూ, ప్లాంట్ కోసం భూములు, ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులు కాంట్రాక్ట్ కార్మికులుగా విధులు నిర్వహిస్తుంటే, వారిని కూడా తొలగించడం అన్యాయమని అన్నారు. తొలగించిన కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోకపోతే, ప్రజా సంఘాలతో కలిసి పెద్ద ఎత్తున కార్యాచరణ రూపొందించి అన్ని గేట్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం, స్టీల్ ప్లాంట్ హెచ్‌ఆర్ విభాగాధిపతి ఎం. మధుసూదన రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు డి. ఆదినారాయణ, పితాని భాస్కరరావు, ఉమ్మిడి అప్పారావు, వంశీకృష్ణ, రవి, సంజీవ్, జి. రామకృష్ణ, ఎస్. ప్రసాద్, యు. అప్పారావు, మంత్రి గోపి తదితరులు పాల్గొన్నారు.

గుర్రం జాషువాకు ఘన నివాళులు



ఉక్కులో జాషువా వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

ఉక్కునగరం: మధురకవి, నవయుగ కవిచక్రవర్తి గుర్రం జాషువాకు ఉక్కునగరంలో ఘన నివాళులర్పించారు. జాషువా 54వ వర్ధంతి సందర్భంగా ఉక్కునగరం జాషువా కమిటీ ఆధ్వర్యంలో సెక్టార్–3లోని గుర్రం జాషువా పార్కులో గురువారం జరిగిన కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కులం, మతం అంటూ సంకుచిత భావాలు కలిగిన సమాజంలో సామాజిక అసమానతల నిర్మూలనకు, మూఢాచారాలపై తిరుగుబాటుకు, ప్రశ్నించే తత్వానికి గుర్రం జాషువా తన రచనల ద్వారా స్ఫూర్తినిచ్చారన్నారు. సగటు మనిషికి అర్థమయ్యే సరళమైన భాషలో హృదయానికి హత్తుకునే ఎన్నో రచనలు చేసిన జాషువా జీవితం నేటి యువతకు ఆదర్శమని పేర్కొన్నారు. తెలుగు సాహిత్య చరిత్రలో జాషువాది ప్రత్యేక అధ్యాయమని, అందుకే ఆయనకు ఉన్న పేరు, ప్రఖ్యాతులు మరో కవికి లభించలేదని వక్తలు తెలిపారు. ఆయన రచనలను భావి తరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని అన్నారు. చుట్టుగుల్ల సుదర్శనం అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు రామ్మోహన్‌కుమార్, వై. వరలక్ష్మి, కొత్తపల్లి సుబ్బారావు, డి. సంపూర్ణం, కె. రాజబాబు, టి. కనకరాజు, ఎల్. ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ రైల్వే స్టేషన్‌లో డీఆర్ఎం తనిఖీలు

తాటిచెట్లపాలెం: డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బొహ్రా ఇతర ఉన్నతాధికారులతో కలిసి గురువారం విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో పర్యటించారు. రుసుము చెల్లించి వాడుకునే మరుగుదొడ్లు, పార్కింగ్ ప్రదేశాలు, వెయిటింగ్ హాల్స్, పాదచారుల వంతెనలు, లిఫ్టులు, వాటర్ బూత్‌లు, కేటరింగ్ స్టాళ్లు, ప్లాట్‌ఫారాలు, పార్సిల్ కార్యాలయాలను డీఆర్ఎం తనిఖీ చేశారు. ప్రయాణికుల సౌకర్యాలను స్వయంగా పరిశీలించారు. రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పర్యవేక్షించి, అధికారులకు సూచనలిచ్చారు.

శ్రావణం .. శుభప్రదం

నేటి నుంచి ప్రారంభం కానున్న శ్రావణ మాసం





ముస్తాబు అయిన అమ్మవారి ఆలయం, పంచాయతన దేవాలయంలో శ్రావణ మాసం తొలిపూజకు ప్రత్యేక అలంకరణలో కన్యాక పరమేశ్వరీ అమ్మవారు

పెదగంట్యాడ: అమ్మవారికి ప్రీతికరమైన శుక్రవారం నుంచే నోములు, వ్రతాలకు నెలవైన శ్రావణ మాసం ప్రారంభమైంది. మాసమంతటా అలరారే పండుగలు, సామూహిక వ్రతాలు ప్రతి ఇంటా సందడి చేయనున్నాయి. శ్రావణంలో భక్తిశ్రద్ధలతో ఆచరించే ప్రతి పండుగ వెనుక ఆధ్యాత్మిక కోణమే కాకుండా, సామాజిక, వైజ్ఞానిక అంశాలు ఎన్నో దాగి ఉన్నాయని పురోహితులు, పెద్దలు చెబుతున్నారు. మానవ సంబంధాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన శ్రావణ మాసం ఈ నెల 25 నుంచి ఆగస్టు 22 వరకు ఉంటుంది. ఇప్పటికే శ్రావణ మాస పూజల కోసం మండలంలోని పలు ఆలయాలు ముస్తాబయ్యాయి.

మహిళలకు ఎంతో ప్రీతిపాత్రమైనది

ఈ నెల మహిళలకు ఎంతో ప్రీతిపాత్రమైనది. ఎందుకంటే, ఈ నెలలో నోములు, వ్రతాలు భక్తితో ఆచరిస్తే దీర్ఘ సుమంగళిగా ఉంటామనే విశ్వాసం ఉండడంతో మహిళలు ఈ మాసాన్ని అత్యంత ప్రీతికరంగా భావిస్తారు. పౌర్ణమి చంద్రుడు శ్రవణా నక్షత్రం మీద సంచరించడం వల్ల ఈ మాసానికి శ్రావణం అని పేరొచ్చింది. అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడిగా పూజలందుకుంటున్న వెంకటేశ్వరస్వామి ఇదే నక్షత్రంలో జన్మించినందున, ప్రత్యేకించి శ్రీవారి ఆలయాల్లో విశేష పూజలు జరుగుతాయి. ఆయన ఇష్టసఖి లక్ష్మీదేవికి, సోదరి గౌరికి సైతం ఇదే మాసంలో ప్రత్యేక పూజలు, వ్రతాలు చేస్తారు. ఈ మాసంలో మంగళ, శుక్ర, శనివారాలను హిందువులు అత్యంత పుణ్యప్రదమైనవిగా భావిస్తారు. మంగళవారం గౌరీ పూజలు, శుక్రవారం లక్ష్మీ పూజలు, శనివారం విష్ణు పూజలు చేస్తారు. ఈ క్రమంలో హౌసింగ్‌బోర్డు కాలనీ కన్యాక పంచాయతన దేవాలయం, బర్మా కాలనీ దుర్గాదేవి ఆలయం, నడుపూరు కన్యకాపరమేశ్వరీ తదితర ఆలయాల్లో ఆలయ కమిటీ సభ్యులు సామూహిక వ్రతాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు.

50 శాతం సీట్లు వినియోగదారుల పిల్లలకే..

అగనంపూడి: ఆర్‌ఈసీఎస్ ఆధ్వర్యంలో నడుస్తున్న రాజీవ్‌గాంధీ పాలిటెక్నిక్ కళాశాలలో 50 శాతం సీట్లు ఆర్‌ఈసీఎస్ వినియోగదారుల పిల్లలకే కేటాయించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ బి. ఉమాశంకర్ తెలిపారు. 79, 85 వార్డుల పరిధిలోని ఆర్‌ఈసీఎస్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరినట్లు నాయకులు కర్రి దోంేంద్ర, బలిరెడ్డి సత్యనారాయణ వెల్లడించారు. కశింకోటలోని ఆర్‌ఈసీఎస్ కార్యాలయంలో ప్రిన్సిపాల్‌ను కలిసి ఈ ప్రాంత వినియోగదారుల పిల్లలకు అవకాశం కల్పించాలని కోరగా, ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. మొత్తం సీట్లలో 50 శాతం కన్వీనర్ కోటాలో భర్తీ చేయగా, మిగిలిన 50 శాతం వినియోగదారుల పిల్లలకు కేటాయించడం జరుగుతుందని నాయకులు పేర్కొన్నారు.

ఘనంగా సామూహిక ధ్యానం



సామూహిక ధ్యానం చేస్తున్న అహింసా పిరమిడ్ ప్రతినిధులు

పెదగంట్యాడ: బ్రహ్మర్షి పితామహ పత్రీజీ స్మృతి స్వర్ణోత్సవాన్ని పురస్కరించుకొని పెదగంట్యాడలోని అహింసా పిరమిడ్ ధ్యానకేంద్రంలో గురువారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. నిర్వాహకుడు మీసాల శివగణేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పత్రీజీ ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలని, శ్వాస మీద ధ్యాసపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని సూచించారు.ఈ సందర్భంగా ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ సామూహిక ధ్యానం చేశారు. శివగణేశ్వరరావు మాట్లాడుతూ, మానసిక ప్రశాంతతకు ధ్యానం ఎంతగానో దోహదపడుతుందని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించి, ప్రతిరోజూ ధ్యానం చేయాలని సూచించారు. మనసు ప్రశాంతంగా ఉంటే ఎటువంటి జబ్బులు దరిచేరవని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో వనిత, అప్పలరాజు, దేవిక, విష్ణుకుమార్, లక్ష్మి, గణేశ్వరరావు, పోలిరాజు, చిన అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలు



సమావేశంలో ప్రసంగిస్తున్న పీపుల్ స్టార్ నారాయణమూర్తి

ఉక్కునగరం: కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలను మరింత బలోపేతం చేయాలని ప్రముఖ సినీ నటులు, పీపుల్స్ స్టార్ ఆర్. నారాయణమూర్తి పిలుపునిచ్చారు. స్టీల్ సీఐటీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలోనూ, రాష్ట్రంలోనూ విద్య, వైద్యం, మౌలిక వసతులు, ప్రభుత్వ రంగ పరిశ్రమల ప్రైవేటీకరణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దూకుడుగా వ్యవహరిస్తున్నాయన్నారు. విద్యను కార్పొరేటీకరించడం వల్ల భవిష్యత్తు తరం అంధకారంలోకి వెళ్తుందని నారాయణమూర్తి పేర్కొన్నారు. సరైన సమయంలో వైద్యం ప్రజలకు అందకపోవడంతో తమ విలువైన ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు అవసరమైన ఉపాధిని కల్పిస్తున్న ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రైవేటు వారికి అప్పగించడం ద్వారా ఉపాధిని కోల్పోయి ప్రజలు ఉగ్రవాదం వైపు మళ్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు. తద్వారా దేశంలో అశాంతి నెలకొని ప్రజలు శాంతిని కోల్పోతారన్నారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా మేధావులు, కవులు, కళాకారులు, కార్మికవర్గం బాధ్యత తీసుకుని ఐక్య పోరాటాలను మరింత బలోపేతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షులు జె. అయోధ్యరామ్ ప్రసంగించగా, ప్రధాన కార్యదర్శి యు. రామస్వామి, కె. గంగాధర్, పుల్లారావు, కె. బాలశౌరి తదితరులు పాల్గొన్నారు.

గోతులు పూడ్చండి



దువ్వాడ ఫేస్–2లో ఆరునెలలుగా పూడ్చని గొయ్యి

కూర్మన్నపాలెం: లీకులు, కేబుల్లు, పైపులైన్ల పనుల కోసం తవ్విన గుంతలను పూడ్చకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా 86వ వార్డులోని పలు కాలనీల్లో రహదారులకు ఆనుకుని తవ్విన పెద్ద పెద్ద గుంతలు ఆరు నెలలుగా అలాగే ఉన్నాయి. వీటిని పూడ్చకపోవడంతో స్థానికులు నానా అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా రాజీవ్‌నగర్, దువ్వాడ ఫేస్–2లో మంచి నీటి లీకేజీని అరికట్టేందుకు రహదారి పక్కన పెద్ద గొయ్యి తవ్వారు. అయితే ఆ గుంతను పూడ్చకుండా వదిలేయడంతో అటుగా ప్రయాణించేవారు భయంతో రాకపోకలు సాగిస్తున్నారు. చీకటి పడితే గుంతలో పడిపోతామేమోనని ఆందోళన చెందుతున్నారు. ఇలా వార్డులో సుమారు 30 వరకు గుంతలు దర్శనమిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయమై అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని వారు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి ఈ గుంతలను పూడ్చాలని పలువురు కోరుతున్నారు.